# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.

- ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వచ్చే జూన్ 1 నుండి కాలువలకు సాగునీటిని విడుదల చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

- యూరియా ముందస్తు నిల్వలు చేయవద్దని, అవసరం మేరకు మాత్రమే వాడాలని మంత్రి కె. అచ్చెన్నాయుడు రైతులకు విజ్ఞప్తి చేశారు.

- విశాఖపట్నం కేజీహెచ్ లో హిమోగ్లోబినోపతి కేంద్రాన్ని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈరోజు ప్రారంభించారు.

==========================

జలవనరుల శాఖ వార్షిక క్యాలెండర్ ప్రకారం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ క్రమంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా... ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థిక శాఖ అధికారులకు సూచించారు. ఇక పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని... నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్-1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు.

==========================

ఖరీఫ్ సీజన్ సంసిద్ధతలో భాగంగా కాలువల్లో పూడిక తొలగింపు పనులు ఈ నెల చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రులు నిమ్మల రామానాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్ దృష్ట్యా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, నీటి పారుదల శాఖల సమావేశం ఈరోజు జరిగింది. ఇరువురు మంత్రులు సాగునీటి విడుదలపై ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. వచ్చే జూన్ 1వ తేదీ నుండి కాలువలకు సాగునీటిని విడుదల చేస్తామని మంత్రి రామానాయుడు వెల్లడించారు. 2025- 26 ఖరీఫ్‌లో 99.35 లక్షల ఎకరాలకు గానూ 888 టీఎంసీల నీటి సరఫరా చేశామని స్పష్టం చేశారు. రబీ సీజన్‌లో 23.67 లక్షల ఎకరాలకు 153 టీఎంసీల నీరు అందించామన్నారు.

==========================

గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా నమోదవుతున్నసికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా వంటి జన్యుపరమైన రక్తహీనత వ్యాధుల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాయని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (KGH)లో 3 కోట్ల 77 లక్షల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన హిమోగ్లోబినోపతి - కాంప్రహెన్సివ్ కేర్ సెంటర్ (COC) ను మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ... రక్తహీనతతో బాధపడే నవజాత శిశువులను ముందే గుర్తించేందుకు, పుట్టిన 24 గంటల లోపే వారికి బ్లడ్ టెస్ట్ చేసే సరికొత్త విధానాన్ని దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కేజీహెచ్‌లోనే ప్రారంభించడం జరిగిందని చెప్పారు. దీని వల్ల చిన్న వయసులోనే రక్తహీనత వ్యాధులను గుర్తించి ప్రాణనష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రాలోని పాలకొండ నుండి రంపచోడవరం, పోలవరం వరకు ఉన్న గిరిజనులందరూ ఈ కేంద్రాన్ని సందర్శించి.. ఉచితంగా రక్త పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

==========================

ఖరీఫ్-2026 సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఆ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ముందస్తు ప్రణాళికలను అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి ఈరోజు వర్చువల్ గా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులు, పంటల వ్యూహంపై కీలక సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూరియా సరఫరా విషయంలో జిల్లాల వారీగా నిల్వలపై పకడ్బందీగా పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. ఎరువుల దుర్వినియోగం, అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు యూరియా సరఫరాను మరింత పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేక కార్డుల విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్డు ద్వారా అవసరానికి అనుగుణంగా యూరియా పొందే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ముందస్తుగా యూరియా నిల్వలు చేయరాదని రైతులకు విజ్ఞప్తి చేశారు. యూరియా వినియోగంలో సమతుల్యత అవసరమని, మొదటి దశలో యూరియా వినియోగించి, తరువాతి దశల్లో నానో యూరియా ఉపయోగించాలని రైతులకు సూచించాలని అధికారులను ఆదేశించారు.

==========================

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు నగరంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఈరోజు పాల్గొన్నారు. నెల్లూరు 48వ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. 54వ డివిజన్‌లో మంచినీటి ట్యాంకు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో 14 వేల కోట్ల రూపాయలతో అమృత్ పథకం కింద పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయని తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీ జలాలను అందిస్తామని నారాయణ తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========================

రాష్ట్రంలోని మూడు గ్రీన్ ఫీల్డ్ పోర్టులను ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో గ్రీన్ ఫీల్డ్ పోర్టులు & పిషింగ్ హార్బర్ల పురోగతిపై ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. మూలపేట పోర్టుకు సంబంధించి ప్రధానంగా ఉప్పు భూముల సమస్య, రోడ్డు, రైల్వే, పునరావాసం వంటి మౌలిక సదుపాయాల కల్పన సమస్యలు పరిష్కరించి పనులు వేగవంతం చేయాలి మంత్రి ఈ సందర్భంగా సూచించారు. మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు సంబంధించి బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. రామాయపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టులో డ్రెడ్జింగ్, పునరావాసం వంటి సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మూడు పోర్టులతో పాటు, ఫేజ్-1 ఫిషింగ్ హర్బర్ ల పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలని మంత్రి బీ సీ జనార్ధన్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు.

==========================

==========================